# వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం

దేవరుప్పుల/ పాలకుర్తి, మే 14: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పలు వివాహాలకు హాజరయ్యారు. వధూవరులకు పట్టు వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. దేవరుప్పులకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆలకుంట్ల వెంకన్న – సుజాత కుమారుడు సందీప్ వివాహం జ్యోతితో బుధవారం జరగ్గా, మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై ఆశీర్వదించి కానుకలు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పల్లా సుందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ప్రధాన కార్యదర్శి చింత రవి, మండల నాయకులు బస్వ మల్లేశ్, కొల్లూరు సోమయ్య, జోగు సోమనర్సయ్య, ఆలకుంట్ల యాదగిరి, వంగ అర్జున్, శీల తిరుమలేశ్, ఓర్సు ఎల్లయ్య, ఆలకుంట్ల మహేశ్, ఆలకుంట్ల తిరుపతి, ఓర్సు అయిలయ్య ఉన్నారు. కాగా, పాలకుర్తి మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో పెద్దవంగర మండలం కాన్వాయ్‌గూడెంకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పనికెర కొమురయ్య కుమారుడు శ్రీకాంత్ – సౌజన్య వివాహానికి హాజరై ఆశీర్వదించారు. పాలకుర్తి మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బండి భాస్కర్ కుమార్తె సౌమ్య – రవికిరణ్ వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. టీఎస్‌కే తండా శివారు బద్దె తండాకు చెందిన పరమేశ్ – మానస దంపతులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు బత్తిని మదన్ ఫర్టిలైజర్ సీడ్స్ షాపును ఎర్రబెల్లి చేతులమీదుగా ప్రారంభించారు. పాలకుర్తి మండలంలోని గోపాలపురానికి చెందిన చెరిపెల్లి కిష్టయ్య గుండెపోటుతో మృతిచెందగా పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కిష్టయ్య మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు అని, అతడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, చింతకింది ఉపేందర్, గుగ్గిళ్ల యాకయ్య, కోసన రాంరెడ్డి, పెద్ద రాంరెడ్డి, వడ్లకొండ అండాలు, చెరిపెల్లి విజయ్‌కుమార్ ఉన్నారు.



పాలకుర్తి: వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- బొడ్రాయి సాక్షిగా మీడియా సమక్షంలో చర్చిద్దామా?
- కడియంకు మాజీ ఎమ్మెల్యే రాజయ్య సవాల్

స్టేషన్ ఘన్‌పూర్, మే 14 : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని తానే అభివృద్ధి చేశానని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసింది శూన్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధిపై బొడ్రాయి సాక్షిగా మీడియా సమక్షంలో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కొద్ది కాలంలోనే కేసీఆర్ సహకారంతో వరంగల్ జిల్లాకు హెల్త్ యూనివర్సిటీ తీసుకువచ్చానని చెప్పారు. ఎంజీఎంలో పీడియాట్రిక్ వార్డు అప్‌గ్రేడ్ చేయించానని, 150 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మంజూరు చేయించానని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే స్టేషన్ ఘన్‌పూర్‌కు వంద పడకల ఆస్పత్రి 2023, ఆగస్టు 3వ తేదీన (జీవో నంబర్ 432) మంజూరైందని, అప్పుడు కడియం శ్రీహరి ఎక్కడున్నాడో తెలపాలన్నారు. నియోజకవర్గంలో ఆరోగ్య ఉప కేంద్రాలన్నీ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే మంజూరయ్యాయని, అందులో కొన్ని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా చేశానని చెప్పారు. ప్రస్తుతం అక్కడక్కడ ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను కడియం శ్రీహరి శంకుస్థాపనలు చేస్తున్నాడని తెలిపారు. బీఆర్‌ఎస్ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరిని విమర్శించే హక్కు తమకే ఉందని, ఆయన ఒకటి అంటే తాము వంద అంటామని రాజయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు

జనగామ, మే 14 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ జనగామ డిపోలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ఉద్యోగులకు బుధవారం డిపో మేనేజర్ ఎస్.స్వాతి ప్రగతిచక్ర అవార్డులు అందజేశారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించి వారు అందించిన సేవలను కొనియాడుతూ ప్రశంసించారు. విధుల్లో ప్రయాణీకుల ఆదరాభిమానాలను పొందుతూ భవిష్యత్‌లోనూ డిపోకు మంచి పేరు తేవాలని ఆమె కోరారు.



జనగామ డిపో ఉద్యోగులను అవార్డులతో సన్మానిస్తున్న డీఎం స్వాతి

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

చిల్పూరు, మే 14 : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. నష్కల్, చిన్నపెండ్యాలలో రూ.10లక్షల చొప్పున నిధులతో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి, గార్లగడ్డతండాలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా 18 ఇందిరమ్మ ఇళ్లకు, కొత్తపల్లిలో రూ.30లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పలుచోట్ల శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని, త్వరలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తానని చెపారు. మరికొన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు, వాగుపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. చిల్పూరు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు, కాంగ్రెస్ చిల్పూరు మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్ చైర్మన్ లావ్యణరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మాజీ ఎంపీపీ వంగాల జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శంకర్‌నాయక్, మండల వైద్యాధికారి డాక్టర్ కుషాలి, డీఈ చంద్రశేఖర్, ఏఈ ప్రీతి పాల్గొన్నారు.



నష్కల్‌లో ఆరోగ్య ఉప కేంద్రానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

## సర్వేయర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ, చౌరస్తా, మే 14: తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) నుంచి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ లోగా మీ సేవ కేంద్రాల్లో రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 37 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో గణితశాస్త్రం ఒక అంశంగా ఉండి కనీసం 60శాతం మార్కులు ఉన్న వారితోపాటు ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) విద్యార్హత గల అభ్యర్థులు సర్వేయర్ శిక్షణకు అర్హులని వివరించారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10వేలు, బీసీలకు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500 ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## గొడ్డలితో దాడి.. వ్యక్తికి గాయాలు

బచ్చన్నపేట, మే 14 : తన భూమిలో చెట్లను నరుకుతుండగా అడ్డుకున్న రైతుపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన బుధవారం మండలంలోని ఇటికాలపల్లిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కాస అయిలయ్యకు చెందిన వ్యవసాయభూమిని అదే గ్రామానికి చెందిన బియ్య లింగయ్య ఆక్రమించడంతోపాటు అందులోని చెట్లను నరుకుతుండగా అడ్డుకున్నాడు. దీంతో అయిలయ్యపై లింగయ్య గొడ్డలితో దాడి చేశాడు. వెంటనే అతడి భార్య 100 డయల్ చేయగా పోలీసులు చేరుకున్నారు. గాయాలపాలైన అయిలయ్యను 108లో జనగామ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హైనా దాడిలో దూడ మృతి

బచ్చన్నపేట, మే 14 : హైనా దాడిలో ఓ దూడ మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మాపూర్ శివారులో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ రెవెన్యూ శివారు సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల వరకు ఉంది. పక్క గ్రామమైన బంజరకు చెందిన బాలసిద్దులు తన భూమిలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో బావి వద్ద ఆవు, దూడను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లే సరికి హైనా దాడిలో దూడ గాయపడి మృతిచెంది ఉంది. దాని విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

# చెత్త సేకరించడం లేదని..

- ట్రాక్టర్ ట్రాలీలో పోసిన స్థానికులు
- లిఫ్ట్ జాకీ లేదని 20రోజులుగా తరలించని వైనం
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నష్కల్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు

చిల్పూరు, మే 14 : మండలంలోని నష్కల్ గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. చెత్త సేకరించకపోవడంతో ప్రతి వాడలో పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్ ట్రాలీ నిలిపి ఉండగా, చుట్టుపక్కల ప్రజలు చెత్త తెచ్చి అందులో పోశారు. అది నిండి 20రోజులు అవుతున్నా తరలించడంలేదు. దీంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గ్రామ ప్రత్యేక అధికారి మధుసూదనాచారికి ఫోన్ చేసినా స్పందించడంలేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి స్నేహను వివరణ కోరగా చెత్త సేకరించే ట్రాక్టర్ ట్రాలీ లిఫ్ట్ జాకీ పనిచేయడంలేదని, గ్రామ పంచాయతీలో నిధులు లేవని చెప్పారు. కాగా, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో చెత్త సేకరణతోపాటు ట్రాక్టర్ ట్రాలీ లిఫ్ట్ జాకీ మరమ్మతు చేయించి, చెత్త తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డ్రెయినేజీల్లో చెత్తచెదారం, మట్టి పేరుకుపోయి వర్షం కురిసినప్పుడు ఉప్పొంగి మురుగునీరు ఇళ్లలోకి వస్తోందని, తగిన చర్యలు చేపట్టాలని కోరారు.



ట్రాక్టర్ ట్రాలీలో పోసిన చెత్త

## రిజర్వాయర్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

పాలకుర్తి, మే 14: పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని పాలకుర్తి రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిగిలిన ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెన్నూరు రిజర్వాయర్ లైనింగ్ పనులను త్వరలో ప్రారంభించాలన్నారు. వర్షాకాలం రాకముందే పనులు పూర్తయితే నీటి నిల్వలను సమర్థంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. రిజర్వాయర్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ సుధీర్, ఈఈ ప్రవీణ్, సీతారాం, డీఈలు శ్రీకాంత్‌శర్మ, రవీంద్ర, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, గుగ్గిళ్ల ఆదినారాయణ, గడ్డం యాక సోమయ్య, ఏఈలు పాల్గొన్నారు.



పాలకుర్తి రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న యశస్వినీరెడ్డి

# సఖీ కేంద్రాన్ని సందర్శించిన మహిళా కమిషన్ సభ్యురాలు

జనగామ, మే 14 (నమస్తే తెలంగాణ) : జనగామలోని సఖీ కేంద్రాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గద్దల పద్మ సందర్శించి రికార్డులను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. సఖీ కేంద్రానికి వచ్చే బాధితులకు ఏ విధంగా సాయం అందుతున్నది? ఎలా స్పందిస్తున్నారని, స్వచ్ఛ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల విధులను అడిగి తెలుసుకున్నారు. అవగాహన సదస్సులు నిర్వహించిన సందర్భాల్లో ఉమెన్ కమిషన్ వాట్సాప్ నంబర్ 949055533, 181 హెల్ప్‌లైన్ నంబర్ తెలియజేయాలని సూచించారు. అవగాహన సదస్సులకు అవసరమైతే తాను కూడా హాజరై మహిళలకు వివిధ అంశాలను తెలియజేస్తానని చెప్పారు.





రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పద్మను సత్కరిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకులు

## ద్విచక్రవాహనం చోరీ

దేవరుప్పుల, మే 14: మండల కేంద్రంలోని శ్రీజ మెడికల్ షాపు ఓనర్ అనంతుల సురేష్‌కుమార్‌కు చెందిన బైక్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. జనగామ – సూర్యాపేట రోడ్డుకు ఆనుకుని ఉన్న మహ్మద్ గనీమియా ఇంట్లో కిరాయికి నివసిస్తున్న అతడు రోజూ రాత్రి తన బజాజ్ పల్సర్ బైక్‌ను పక్కన ఖాళీ స్థలంలో పార్కింగ్ చేస్తుంటాడు. రోజూ మాదిరిగానే రాత్రి 8 గంటలకు షాపు మూసి తన వాహనంపై ఇంటికి వచ్చిన సురేష్‌కుమార్ అక్కడే పార్క్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున 5గంటలకు చూసేసరికి బండి కనిపించలేదు. పలుచోట్ల వెతికినా దొరక్కపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సురేష్‌కుమార్ తెలిపారు.

# శుభ కార్యాలకు హాజరైన ఎమ్మెల్యే పల్లా

జనగామ, మే 14 (నమస్తే తెలంగాణ): జనగామ నియోజకవర్గంలో బుధవారం జరిగిన పలు వివాహాది శుభ కార్యాలు, శారీ ఫంక్షన్, రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓం సాయి ఫంక్షన్‌హాల్‌లో క్యాంపు కార్యాలయ సిబ్బంది దాసరి పల్లవి భాస్కర్ కుమార్తె శారీ ఫంక్షన్‌లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అదేవిధంగా జిల్లా ప్రధాన ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ఆర్యన మల్టీక్యూసిన్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. నర్మెట మండలం కన్నెబోయినగూడెంలో బొడికె ఎల్లస్వామి కుమారుడి వివాహ వేడుక సహా చేర్యాల మండలం కొత్త దొమ్మాటలో బీఆర్‌ఎస్ నాయకుడు తాండ్ర లక్ష్మయ్య కుమార్తె పెళ్లి వేడుక, కొమురవెల్లిలో బీఆర్‌ఎస్‌వీ నాయకుడు ఏర్పుల మహేశ్ ఆధ్వర్యంలో నిర్మాణమైన జమదగ్ని రేణుకా ఎల్లమ్మగుడి సందర్శించి, అదే గ్రామంలో కాపర్తి మల్లికార్జున్ వాసవి కుమార్తె వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు తాళ్ల సురేశ్‌రెడ్డి, నాయకులు ముస్త్యాల దయాకర్, ఉల్లెంగుల సందీప్, గుర్రం నాగరాజు, సెవెల్లి మధు, నీల యాదగిరి, పల్లా రాకేశ్‌రెడ్డి ఉన్నారు.



దాసరి పల్లవి భాస్కర్ కుమార్తెను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# సుందరీమణుల పర్యటనతో ముందస్తు అరెస్టులు

జనగామ చౌరస్తా/ పాలకుర్తి/ జఫర్‌గఢ్/లింగాలఘనపురం, మే 14 : ప్రపంచ సుందరీమణుల వేయిస్తంభాల గుడి, రామప్ప పర్యటన నేపథ్యంలో బుధవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), పీడీఎస్‌యూ, బీజేపీ మహిళా మోర్చా జిల్లా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్యను స్టేషన్ ఘన్‌పూర్ పీఎస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షబానాను జఫర్‌గఢ్ పీఎస్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి, ఉడుగుల శ్రీలత, శోభనబోయిన అనురాధతోపాటు ఐద్వా పట్టణ అధ్యక్షురాలు పందిళ్ల కల్యాణిని జనగామ అర్బన్ పీఎస్‌కు తరలించారు. పాలకుర్తి మండలంలోని గూడూరులో ఐద్వా సమావేశంలో మండల నాయకురాలు నక్క సంపూర్ణ మాట్లాడుతూ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన ఐద్వా నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకురాళ్లు బెల్లి విజయ, రజిత, పద్మ, పుల్లమ్మ, పిచ్చమ్మ పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండలంలోని తమ్మడపల్లి(జీ)లో ఉపాధి హామీ పనికి వెళ్లిన ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానాను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాగా, అక్రమ అరెస్ట్‌లపై సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, ఐద్వా జఫర్‌గఢ్ మండల కార్యదర్శి రాపర్తి రజిత ఖండించారు. సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, కాట సుధాకర్, ఐలయ్య, రాములు, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు. ఆయా నాయకురాళ్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి, మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా అందాల పోటీలను నిర్వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. అందాల పోటీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని అన్నారు. లింగాలఘనపురానికి చెందిన దిశ కమిటీ మాజీ సభ్యురాలు ఊడుగుల భాగ్యలక్ష్మి, కళ్లెం గ్రామానికి చెందిన మబ్బు రాజును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



జనగామ చౌరస్తా: అర్బన్ పీఎస్‌లో అరెస్టయిన ఐద్వా నాయకురాళ్లు

## జీడికల్ ఆలయంలో ద్వారపాలకుల పునఃప్రతిష్ఠాపన

లింగాలఘనపురం, మే 14: మండలంలో మరో భద్రాద్రిగా పేరుగాంచిన జీడికల్ వీరాచల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ద్వారపాలకుల విగ్రహాలను బుధవారం పునఃప్రతిష్ఠించారు. వందల ఏళ్లక్రితం నిర్మించిన ఆలయానికి తోరణ ప్రాకార గోడపై దశావతారాల విగ్రహాలు, ప్రధాన ద్వారానికి ఇరువైపులా చండ, ప్రచండ ద్వారపాలకుల విగ్రహాలు ఉండేవి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధిలో భాగంగా ప్రాచీన ఆలయ రూపురేఖలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాకార గోడను తొలగించి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న ద్వార పాలకుల విగ్రహాలను మరోచోట భద్రపరిచారు. ఆలయాన్ని మహాప్రాకారం, రాజగోపురం నిర్మించారు. రాజగోపుర ద్వారానికి ఇరువైపులా ద్వార పాలకులైన చండ, ప్రచండ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పునఃప్రతిష్ఠించారు. అర్చకులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, జనగామ ఉప్పలమ్మ దేవాలయ ఈవో కేకే రాములు, ఆలయ చైర్మన్ ఏలె నరసింహమూర్తి, డైరెక్టర్ ఉడుగుల వెంకన్న, సిబ్బంది కొండబోయిన భరత్‌కుమార్, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.



పునఃప్రతిష్ఠించిన ద్వార పాలకులు చండ, ప్రచండ విగ్రహాలు

## కేసముద్రంలో పలు రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

కాజీపేట, మే 14 : ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న మూడోలైన్ ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల వల్ల విజయవాడ నుంచి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మీదుగా నడిచే పలు రైళ్లకు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో తాత్కాలిక హాల్టింగ్ ఏర్పాటు చేశారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మణుగూర్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం–బీదర్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు–లింగంపల్లి మధ్య నడిచే గౌతమీ ఎక్స్‌ప్రెస్, గూడూర్– సికింద్రాబాద్ మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుపతి–సికింద్రాబాద్ మధ్య నడిచే పద్మావతి, విశాఖపట్నం– హైదరాబాద్ మధ్య నడిచే గోదావరి, విశాఖపట్నం– మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం–హైదరాబాద్ మధ్య నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఆగుతాయని తెలిపారు. ఈనెల 24న తిరుపతి–కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి 26వ తేదీ వరకు భువనేశ్వర్–ముంబై మధ్య నడిచే కోణార్క్, ఈ నెల 27న మచిలీపట్నం– సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, 26న కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి 26వ తేదీ వరకు శాలిమార్– హైదరాబాద్ మధ్య నడిచే ఈస్ట్‌కోస్ట్, 25, 27వ తేదీల్లో నర్సాపూర్ – నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 25న చెన్నై సెంట్రల్ –అహ్మదాబాద్ మధ్య నడిచే నవజీవన్, 27న బెంగళూరు– లాల్ కౌన్ ఎక్స్‌ప్రెస్, 27న కోయంబత్తూర్–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుతున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు.

## అధ్వానంగా రైతు వేదికలు

- నిర్వహణ సరిగా లేక పెరిగిన కంపచెట్లు
- అటువైపే రాని వ్యవసాయ శాఖ అధికారులు

జనగామ రూరల్, మే 14: కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు వేదికల నిర్వహణ అధ్వానంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించి రైతులకు ఎంతో మేలు చేసింది. కానీ కాంగ్రెస్ వచ్చాక నిర్వహణ సరిగా లేక ఆవరణలో ముళ్లకంప చెట్లు పెరిగాయి. ఏ రైతువేదిక చూసినా కంపచెట్లతోపాటు చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. దీంతో రైతు వేదికలకు వ్యవసాయశాఖ అధికారులు రావడంలేదు. ఈ క్రమంలో వాటికి తాళం వేసి ఉంటోంది. మరుగుదొడ్లు కూడా పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకునేవారు కరువయ్యారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైతు వేదికలు, పరిసరాలను శుభ్రం చేయించి, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



కంపచెట్ల మధ్యలో మరుగుదొడ్లు



పెంబర్తిలో ముళ్లచెట్లతో ఉన్న రైతువేదిక

## కేయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం


హనుమకొండ చౌరస్తా, మే 14: కాకతీయ విశ్వవిద్యాలయ డిగ్రీ పరీక్షలు, విశ్వవిద్యాలయ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లోని మొత్తం 118 సెంటర్లలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. మొదటిరోజు రెండో, ఆరో సెమిస్టర్ (రెగ్యులర్) ప్రారంభమైనట్లు, టైమ్‌టేబుల్ ప్రకారం మిగతా పరీక్షలు జరుగుతాయని, నగరంలోని వివిధ కాలేజీల్లో రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రామచంద్రంతో కలిసి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు పి.వెంకటయ్య, తిరుమలదేవి ఉన్నారు.

## భూ మాత రైతు సంక్షేమ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా చంద్రమౌళి



జఫర్‌గఢ్, మే 14 : భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గంధం చంద్రమౌళిని నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జఫర్‌గఢ్ మండలం వడ్డెగూడెంకు చెందిన గంధం చంద్రమౌళి రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. రైతుల కష్టాలు, వ్యవసాయ విధానాలను భూమాత రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండటంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు.

## చీటూరువాసికి ప్రొఫెసర్‌గా పదోన్నతి



డాక్టర్ అయిల చంద్రయ్య

లింగాలఘనపురం, మే 14: హైదరాబాద్‌లో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న.. మండలంలోని చీటూరుకు చెందిన డాక్టర్ అయిల చంద్రయ్యకు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ కళాశాలల విద్యాకమిషనర్ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అయిలయ్య ప్రాథమిక విద్య చీటూరు, ఇంటర్ జనగామ, డిగ్రీ, బీఈడీ, పీహెచ్‌డీ సికింద్రాబాద్‌లో పూర్తి చేశారు. సర్దార్‌పటేల్ కళాశాలలో 1992లో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పదోన్నతి రావడంతో చీటూరు గ్రామస్తులు ఆయనను అభినందిస్తున్నారు.

## నిట్‌లో సీసీఎంటీ, సీసీఎంఎన్ పోర్టల్స్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, మే 14: భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంటెక్, ఎం.ఆర్క్, ఎం.ప్లాన్ కోర్సుల కేంద్రీకృత ప్రవేశాల కోసం, ఎమ్మెస్సీ టెక్ కోర్సుల కోసం నిర్వహణ చర్యలు చేపట్టారు. 2025–26 విద్యా సంవత్సరానికి సీసీఎంటీ–2025లో మొత్తం 76 ప్రముఖ విద్యాసంస్థలు, సీసీఎంఎన్–2025లో 32 సంస్థలు పాల్గొంటున్నాయని సీసీఎంటీ, సీసీఎంఎన్ చైర్మన్, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. వీటిలో 31 నిట్‌లు, జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విద్యాసంస్థలు కొన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చిన సాంకేతిక విద్యాసంస్థలు, అలాగే కొన్ని ఇండియన్ ఇన్ స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లు ఉన్నాయి. బుధవారం ఉదయం 10 గంటలకు ఈ రెండు కౌన్సెలింగ్‌ల కోసం అధికారిక పోర్టల్స్ ప్రారంభించారు. CCMT పోర్టల్: https://ccmt.admissions.nic.in, CCMN పోర్టల్: https://ccmn.admissions.nic.in దరఖాస్తుదారులు సంపూర్ణ సమాచారం బ్రోచర్‌లను జాగ్రత్తగా చదవాలని, నమోదు గడువు 14 నుంచి 4 జూన్ వరకు ఉంటుందన్నారు.